
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 25 అక్టోబరు 2025



గరిష్ఠం 28.0
కనిష్ఠం 22.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.10 (305.5646)	46,748	46,748
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	2,551.83	2,860.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

ధాన్యం కొనుగోళ్లపై.. సందిగ్ధం

- క్షేత్రస్థాయిలో పలు అవరోధాలు
- మిల్లుల్లో పేరుకుపోయిన యాసంగి బియ్యం
- ఆ నిల్వలను తరలించకపోతే ఇబ్బందులేననే సంకేతాలు
- సన్నధాన్యం మిల్‌పాయింట్ల వద్ద విక్రయానికే రైతుల మొగ్గు
- ధర తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగడంపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఆటంకాలను పరిష్కరించలేకపోతే, ధాన్యం ఉధృతి ప్రారంభమయ్యాక ఇబ్బందులు ఏర్పడుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

జిల్లాలోని రైస్ మిల్లుల్లో ఇప్పటికే యాసంగి ధాన్యాన్ని పేరుకుపోయి ఖాళీ జాగా లేదు. దీంతో ప్రభుత్వం వానాకాలం సీఎంఆర్ కోసం ఇచ్చే ధాన్యం దిగుమతిలో మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తే దీని ప్రభావం తమపై పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని, లేదంటే కొనుగోళ్లలో ఇబ్బందులు తప్పవని అభిప్రాయ పడుతున్నారు. ఈ సమస్యతో పాటు మిల్‌పాయింట్ల వద్ద సన్నధాన్యాన్ని నేరుగా కొనుగోలుచేస్తుండటంతో నాణ్యత పేరుతో ధర తగ్గిస్తున్నారని, మిల్‌పాయింట్ల వద్ద కొనుగోళ్లు కొనసాగినంత కాలం రెవెన్యూ ఉద్యోగులను నియమించాలని రైతులు కోరుతున్నారు. పోలీసులు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, తూనికలు కొలతలశాఖ అధికారులు బృందంగా ఏర్పడి తరచూ మిల్‌పాయింట్లను తనిఖీ చేయాలని రైతులు పేర్కొంటున్నారు.

మిల్‌పాయింట్లకే సన్నధాన్యం

సన్నధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు మాత్రం మిల్‌పాయింట్ల వద్దకే నేరుగా తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఈసారి ధాన్యం బిల్లులతో పాటు, బోనస్ కలిపే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు మాత్రం మిల్‌పాయింట్లకు తరలించేందుకే మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం మూసీ ఆయకట్టుతో పాటు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో బోరుబావుల కింద సాగైన వరి కోతలు పూర్తవడంతో ఆ ధాన్యం మార్కెట్‌కు వస్తోంది. ప్రధానంగా యాదాద్రి జిల్లాతో పాటు, నల్లగొండ జిల్లాలోని చిట్యాల, కట్టంగూరు, నార్కట్‌పల్లి, కనగల్, నల్లగొండ, ఇతర నాన్ ఆయకట్టు ప్రాంతాల నుంచి మిర్యాలగూడ మిల్లులకు ధాన్యం వస్తోంది. మరోవైపు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేసింది. గ్రేడ్-1 ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2,389ఉండగా, ప్రస్తుతం మిల్‌పాయింట్ల వద్ద కనిష్ఠంగా రూ.2,200 నుంచి గరిష్ఠంగా రూ.2,450 వరకు చెల్లిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉండడం, పచ్చిధాన్యమే కొనుగోలు చేస్తుండడంతో ధర తగ్గించినా రైతులు మిల్లుపాయింట్ల వద్దే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా నాణ్యమైన ధాన్యానికి కూడా ధర తగ్గిస్తున్నారని, దీన్ని కట్టడిచేసేందుకు మిల్‌పాయింట్ల వద్ద గత సీజన్‌లో ఏర్పాటు చేసినట్టు రెవెన్యూ ఉద్యోగులను నియమించాలని రైతులు కోరుతున్నారు.ఈ సీజన్‌లో ప్రస్తుతం జైశ్రీరామ్(చింటు్లు, పూజాగోల్డ్, చిట్టిపొట్టి)రకం ధాన్యంతో పాటు,హెచ్ఎంటీ-505 రకం ధాన్యం ఎక్కువగా దిగుబడి వచ్చింది.

ధర తగ్గడంతో కామన్ వెరైటీల కొనుగోళ్లు నిల్

కామన్ వెరైటీలైన ఎంటీయూ-1010 వంటి రకాలను మిల్లర్లు కొనుగోలు చేయడంలేదు. ఈ రకం బియ్యానికి పోర్టుల వద్దకు డెలివరీ ఇచ్చినా క్వింటాకు రూ.2,940 మాత్రమే ధర లభిస్తుండడంతో, ఆ మేరకు ధాన్యం ధర తగ్గించాల్సి ఉండడంతో మిల్లర్లు కొనుగోళ్లను నిలిపేశారు. సీజన్ ఆరంభం కావడం, సన్నధాన్యం వస్తుండడంతో సన్నరకాలపైనే మిల్లర్లు దృష్టి సారించారు. అయితే ఈ రకాలను ప్రభుత్వరంగ సంస్థలు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటంతో, ఆ ధాన్యాన్ని కేటాయించిన మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని రైతులు....

- మిగతా 8వ పేజీలో...

నాణ్యతా ప్రమాణాలతో తెస్తే మద్దతు ధర



మునుగోడులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యతా ప్రమాణాలతో పంట ఉత్పత్తులు తీసుకువస్తే మద్దతు ధర లభిస్తుందని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మునుగోడులోని సలాసర్ బాలాజీ పత్తి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం, నాణ్యత, మిల్లులో వేబ్రిడ్జి తూకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొత్తగా 'కిసాన్ కపాస్' యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌తో మాత్రమే పత్తి కొనుగోళ్లు జరుగుతాయన్నారు. నాణ్యత ఉన్న పంట విక్రయ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా ఒకే రోజున సులువుగా పూర్తవుతుందన్నారు. సీజన్‌లో ఒక రైతు మూడు దఫాలుగా స్లాట్ బుక్ చేసుకోవచ్చని, ఏదేని కారణాలతో బుకింగ్‌ను కూడా రద్దు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలోనే మునుగోడు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో 19 వేల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు సామర్థ్యం ఉందన్నారు. గతంలో ఎల్-1 కేంద్రంగా ఉండటంతో ఇతర జిల్లాల పత్తిని ఇక్కడ విక్రయించేవారని, దీంతో ఇక్కడి రైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కొత్త విధానం ద్వారా అలాంటి సమస్యలు ఉండవన్నారు. కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి...

- మిగతా 8వ పేజీలో...

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఎస్పీ శరత్ చంద్ర పవార్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రౌడీ షీటర్లకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన మాట్లాడారు. రౌడీషీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఊరుకునేది లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఆర్థిక, భూ సెటిల్‌మెంట్ల పేరుతో సామాన్య ప్రజలను దౌర్జన్యాలు, బెదిరింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రతీ కదలికను పరిశీలించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ హరిబాబు, టూటౌన్ ఎస్ఐ సైదులు, రూరల్ ఎస్ఐ సైదాబాబు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణదాతలు కావాలన్నారు.

అనంతరం జిల్లా వ్యాప్తంగా పోలీసులతో పాటు యువకులు ఎక్కువ సంఖ్యలో హాజరై 150 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐలు సంతోష్, శ్రీను, హరిబాబు, ఆర్ఎస్ఐలు కల్యాణ్, రాజీవ్, సాయిరాం, సంతోష్, అశోక్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 275 పరిశ్రమల ప్రతినిధులు

- ఆదివారం కూడా నిర్వహించాలని నిర్ణయం
- రెండు రోజుల పాటు నిర్వహణ
- 40 వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యే అవకాశం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జాబ్‌మేళా ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న మెగాజాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభిస్తోందని, రాష్ట్రంలోని 275 పరిశ్రమలప్రతినిధులు హాజరుకానున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. అంతకుముందు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టణంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడమే మెగాజాబ్‌మేళా లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జాబ్‌మేళా నిర్వహించి పల్లె ప్రాంతాల్లో చదువుకున్న యువతీ, యువకులకు ఉద్యోగం కల్పించి వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జాబ్‌మేళాకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 36వేల మంది నిరుద్యోగులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, ఇది 40వేలకు పెరిగే అవకాశం ఉందన్నారు. దేశంలోని ప్రముఖ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. సుమారు 270 కంపెనీలు నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలు రెండురోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. నిరుద్యోగులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దనే ఈ అవకాశం కల్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 80వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంత రం పాటుపడుతున్నామన్నారు. యువతీ, యువకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని రెండురోజులు జాబ్‌మేళాకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు కూడా జాబ్‌మేళా వద్ద పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. జాబ్‌మేళాకు వచ్చే యువతీ, యువకులు ఒత్తిడికి లోనుకాకుండా క్రమశిక్షణ పాటించి ఇంటర్వ్యూలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతంలోని గ్రామీణ యువతకు మెరుగైన ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు. 275 పరిశ్రమలు ఈ జాబ్‌మేళాలో పాల్గొని అర్హతను బట్టి ఉపాధి కల్పిస్తాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని సిమెంట్, ఫార్మ కంపెనీలలో కూడా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనుకున్నదాని కన్నా ఎక్కువ స్థాయిలో నిరుద్యోగులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రకారం 36వేలు దాటగా మరో 10వేల మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఆర్డీవోలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, జిల్లా ఉన్నతాధికారులతో పాటు తన్నీరు మల్లికార్జున్‌రావు, సర్వోత్తం రెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, ఈదుప్పగంటి సుబ్బారావు, గూడెపు శ్రీను, గెల్లి రవి, దొంతగాని శ్రీనివాస్, పోతు భాస్కర్, వేణారెడ్డి, అరుణ్‌కుమార్, అజీజ్‌పాషా, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

అడవిదేవులపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి, బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించి వీఎల్ఆర్ పొందాలని డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తీసుకున్న రుణాలను చెల్లించి ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని పొందాలన్నారు. అర్హత ఉన్న సభ్యులతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని, అందుకు ప్రతీ ఇంటికి వెళ్లి సంఘంలో లేని సభ్యులను గుర్తించాలన్నారు. ఈ ఏడాది వృద్ధ మహిళలు, దివ్యాంగులు, కిశోర బాలికలతో సంఘాలుగా ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. వారికి బ్యాంక్ రుణాలు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతీ వీవోఏ సాధించాలన్నారు. సంఘం సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. నవంబరు 30లోగా అన్ని రకాల రుణాలను వందశాతం రికవరీ చేయాలన్నారు. కాగా, సమావేశానికి కొంతమంది గ్రామ సంఘం అసిస్టెంట్లు హాజరు కాకపోవడం, రుణాల వసూలులో నిర్లక్ష్యంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరును మార్చుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, డీపీవో సోమయ్య, స్త్రీనిధి ఆర్ఎం శ్రీలేఖ, ఏపీఎం కె.రమణాకర్, ఏపీవో సూరా నాయక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

19న బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవం



పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్

నల్లగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నవంబరు 19న నిర్వహించే గిరిజన బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో స్వర్ణోత్సవ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే ఈ స్వర్ణోత్సవంలో గిరిజనులంతా పాల్గొనాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి మొదటి నుంచి కృషి చేసింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గిరిజన బంజారాల రిజర్వేషన్ 50 ఏళ్ల స్వర్ణోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పమాలార్పణ, సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో గిరిజన తెగలను ఎస్టీ జాబితాలో చేర్చినట్టు పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్‌కు 50ఏళ్లు పూర్తయినందున స్వర్ణోత్సవ వేడుకలను ఢిల్లీలో ఘనంగా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి గిరిజనులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో చందంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బద్యానాయక్, పలువురు గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

పంటల విస్తీర్ణంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం

గణాంకశాఖ డీడీజీ అజిత్‌కుమార్



అన్నెపర్తిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాకాలం పంటల విస్తీర్ణం, పంట రకాలు, నీటి వసతి, తదితర అంశాలను అధ్యయనం చేయనున్నట్టు జాతీయ గణాంక కార్యాలయం (నేషనల్ స్టాటిస్టిక్స్) రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్.అజిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అన్నెపర్తి గ్రామంలో సుమారు 20 సర్వే నంబర్లలో పంటపొలాలను ఆయన పరిశీలించారు. 20 సర్వే నంబర్లలో నాలుగు విభాగాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అందులో భాగంగా వివిధ రకాల పంటలు, నీటి వసతి, విత్తన రకం, తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా పంట సీజన్లలో జాతీయ గణాంక విభాగం నుంచి పంటల క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట తహసిల్దార్ కే.పరుశురాం, ఎంపీఎస్‌వో శేఖర్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యత నగుబాటు

- రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు
- ఆరు నెలలకే కంకర తేలిన వైనం




కంకర తేలిన సీసీ రోడ్డు

కొండమల్లేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సీసీ రోడ్ల నిర్మాణం కాంట్రాక్టర్లకు వరంగా మారుతోంది. మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులోని శివజ్యోతినగర్‌లో ఈ ఏడాది మార్చి 10న ఎన్ఆర్‌జీఎస్ నిధులతో రూ.30లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఆరునెలలకే కంకర తేలింది. సీసీరోడ్డు నిర్మాణానికి ముందు మట్టి రహదారిని చదును చేసి కంకర పరచాలి. అంతేగాక రోడ్డు మొత్తం ఒకే మందంతో ఉండాలి. అయితే ఈ రోడ్డు చివరి అంచులు మాత్రం అంచనాలకు తగ్గట్టు ఏడు అంగుళాల వరకు కనిపిస్తున్నా మధ్యలో మాత్రం అందులో సగమే ఉంది. సిమెంట్ పరిమాణాన్ని తగ్గించడం, దాని స్థానంలో కంకర పొడి, నాణ్యత లేని ఇసుకను కలిపి సీసీ రోడ్డు నిర్మించడంతో నెలలోపే కంకర తేలి నెర్రలు,పగుళ్లు వచ్చి ధ్వంసమవుతున్నాయి.సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యాక ఇరువైపులా మట్టి పోసి లెవల్ చేయాలి. కానీ ఎక్క డా మట్టి పోయకుండానే బిల్లులు డ్రాచేస్తున్నట్టు తెలుస్తోంది. నాణ్యత, నిబంధనలు పాటించకపోవడంతో ఆరు నెలలు గడవకముందే రోడ్లు కంకర తేలి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డును ధ్వంసంచేసి డ్రైనేజీకి మరమ్మతులు

మట్టి రోడ్డును చదును చేయకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి దానిపై సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిపోవడంతోపాటు, సీసీ రోడ్డుపై ఓ లారీ వెళ్లడంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సైతం కుంగింది. దీంతో కొంత మంది వారి ఇంటి ముందు నుంచి వెళ్తున్న మురుగు నీటి కోసం రోడ్డును ధ్వంసం చేసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి మురుగు వెళ్లేలా చేశారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..



సీసీ రోడ్లు నిర్మించి ఐదారు నెలలు గడవకముందే కంకర తేలింది. రోడ్డు పనుల్లో ఎలాంటి నిబంధనలు పాటించక ఇష్టానుసారంగా నిర్మించడంతో కొద్ది రోజులకే మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. రోడ్డు నాణ్యంగా లేదని అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. సరిపడా సిమెంట్ వేయకుండా కంకర, ఇసుక అధికంగా కలపడంతో రోడ్డుపై కంకర తేలింది. ఇప్పటికైన అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

- కుంభం యాదగిరిగౌడ్, కొండమల్లేపల్లి

కార్తీక మాసం అన్నింటా ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)
ప్రజలందరిలో భక్తిభావం పెరగడంతో ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య కూడా పెరుగుతోంది. రవాణా సౌకర్యాలు మెరుగవడం, ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో యాత్రాస్థలాలు, క్షేత్రాల సందర్శనకు వచ్చే భక్తుల సంఖ్యకు పెరిగింది. దీంతో ఆలయ సందర్శనకు ముడిపడి ఉన్న వ్యాపారాలకు కూడా క్రమంగా గిరాకీ పెరిగింది. ఇందులో భాగంగానే కార్తీక మాసంలో ముఖ్యంగా పూజా స్టోర్‌లు సందడిగా ఉంటున్నాయి. వినాయక చవితి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాల సందడి నెలకొంటుంది. ఆ తర్వాత దేవీశరన్నవరాత్రోత్సవాలు, ఆపై దీపావళి నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుండటంతో పూజాసామాగ్రి వాడకం పెరుగనుంది. దీంతో పూజాస్టోర్ నిర్వాహకులు కూడా కొన్ని రోజుల ముందు నుంచే సామాగ్రి నిల్వలను పెంచుకుంటారు. ముఖ్యంగా పసుపు, కుంకుమ, గంధం, హారతి కర్పూరాలు, పత్తితో చేసిన వొత్తులు, కొవ్వొత్తులు, నువ్వుల నూనె బాటిళ్లు, నెయ్యి ప్యాకెట్లు, ఊది బత్తీలు, ఆయా రకాల వత్తుల ప్యాకెట్లను నిల్వ చేసుకుంటారు. ప్రతీ నెలా రూ.2లక్షల వ్యాపారం చేస్తే ఒక్క కార్తీక మాసంలోనే సుమారు రూ.5లక్షల వరకు వ్యాపారం ఉంటుంది. నువ్వుల నూనె బాటిళ్ల సిద్దిపేట జిల్లా నుంచి, పత్తి, ధారపు వత్తులు ఏపీలోని పిఠాపురం నుంచి, పసుపును నిజామాబాద్ నుంచి, కుంకుమ హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇందుకోసం ముందుగానే ఆర్డర్ పెట్టుకుంటామని తెలిపారు.


ఓ దుకాణంలో నిల్వ చేసిన పూజాసామాగ్రి

కార్తీకం మాసం పూజా సామాగ్రికి ప్రత్యేకం



పూజాసామాగ్రి వ్యాపారస్థులకు కార్తీక మాసమే వ్యాపార మాసం. ఈ మాసంలో పూజాసామాగ్రి వాడకం ఎక్కువగా ఉంటుంది. వినాయక, దసరా నవరాత్రి ఉత్సవాలు మొదలుకుని కార్తీక మాసాంతం తదుపరి అయ్యప్ప దీక్షల ముగింపు వరకు వ్యాపారం ఉంటుంది. ఏడాదిలో ఆరు నెలల పాటు ఉండే వ్యాపారం ఒక ఎత్తయితే కార్తీక మాసంలో జరిగే వ్యాపారం ఎక్కువగా ఉంటుంది.
- బండారు రమేష్, పూజా సామాగ్రి వ్యాపారి, నార్కట్‌పల్లి.

కార్తీకమాసం అంటేనే ఆధ్యాత్మిక మాసం. లయకారకుడైన పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో ప్రతీ భక్తుడు వీలైనంత వరకు ప్రతీ రోజూ ఉదయాస్తమాన సమయాల్లో ఓ దీపాన్ని వెలిగించాలని తాపత్రయపడతాడు. నిత్యం ప్రతీ దేవాలయంలో ప్రతీ ఇంటి ముంగిట చీకట్లను తరిమేసేలా దీపాల వెలుగులు విరజిమ్ముతాయి. దీంతో ఈ మాసంలో కొబ్బరికాయలతో పాటు దీపాలు వెలిగించేందుకు అవసరమైన నువ్వుల నూనె, ప్రమిదలు, వత్తులు, కొవ్వొత్తులు, నెయ్యికి డిమాండ్ ఉంటుంది. అందుకే ఈ మాసంలో వీటి విక్రయాలు ఎక్కువగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ మాసం మొత్తం శాకాహార భోజనం చేస్తుంటారు. దీంతో కూరగాయల ధరలు పెరగడంతో పాటు మాంసం ధరలు తగ్గుముఖం పడతాయి.



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)
కార్తీకమాసంలో చాలామంది తమ ఇష్టదైవాలను ప్రత్యేకంగా కొలుస్తుంటారు. అయ్యప్ప, శివ,ఆంజనేయ, భవానీమాలలు ధరిస్తుంటారు. మాలధారులతో పాటు ఇంట్లో వారు సైతం అదే నిష్ఠతో ఉంటారు. కూరగాయల భోజనానికే అధిక ప్రాధాన్యమిస్తారు. చాలామంది మాంసాహారానికి దూరంగా ఉండటంతో శాకాహారమాసంగా పిలుస్తుంటారు. ఈ మాసంలో మాంసం కొనుగోలు అంతగా లేక ధరలు తగ్గనుండగా, కొనుగోళ్ల పెరిగి కూరగాయల ధరలు పెరుగుతాయి. ప్రతీ ఒక్క కూరగాయ గత నెల కిలో రూ.50లోపు ఉండగా ప్రస్తుతం రూ.60 నుంచి రూ.80 వరకు ఉన్నాయి. దోసకాయ కిలో రూ.60, కాకరకాయ రూ.80, బెండకాయ కిలో రూ.50, దొండకాయ కిలో రూ.60, గోకరకాయ కిలో రూ.80, పచ్చిమిర్చి కిలో రూ.80, టమాట కిలో. రూ.30, ఆలుగడ్డ రూ.50, వంకాయ రూ.40, బీరకాయ రూ.80 పలుకుతోంది.

ఆరోగ్యమే ప్రధానంగా..

కార్తీకమాసంలో కూరగాయల భోజనానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఉపవాసాలు ఉండటంతో అధిక పోషకాలు ఉంటాయని కూరగాయల భోజనాన్ని భుజిస్తుంటారు. వేగంగా జీర్ణక్రియ జరగడంతో పాటు మలబద్ధకం సమస్యలు దరిచేరవు. అంతేకాకుండా కూరగాయల్లో ఖనిజాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్‌లు, ఫైబర్ అధికంగా లభిస్తుంది. ప్రతి ఒక్క కుటుంబంలో బీపీ, షుగర్‌తో పాటు పలు దీర్ఘకాలిక రోగాలు ఉన్నవారు ఉండడంతో ప్రస్తుతం కూరగాయలను స్వీకరిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో 3,71,400 కుటుంబాలు ఉండగా వీరిలో మూడువంతుల మంది కూరగాయలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వారంలో రెండు రోజులు ఆకుకూరలు తీసుకుంటున్నా



గతంలో మాంసానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవాడిని. ప్రస్తుతం వారంలో నాలుగు రోజులు కూరగాయలు, రెండు రోజులు ఆకుకూరలు తింటున్నా. ఆరోగ్యం బాగుంటుంది. ఎలాంటి ఆరోగ్య సమస్యకైనా కొంత కూరగాయలు ఉపశమనం కలిగిస్తాయి.
- భానుచందర్, సూర్యాపేట వాసి

కార్తీకమాసంలో మాంసాన్ని తీసుకోం



గత ఏడేళ్లుగా కార్తీకమాసంలో మాంసాన్ని తినడంలేదు. మా కుటుంబ సభ్యులు అంతా ఈ నెలరోజుల పాటు కూరగాయల భోజనం చేస్తారు. భక్తితో పాటు ఆరోగ్యం బాగుంటుంది. కూరగాయల ధరలు కాస్త అధికంగా ఉన్నాయి.
- పద్మ, పట్టణవాసి

బురద దారిలో వెళ్లేదెలా


గుంతలమయమైన రహదారిలో అలుగునూరు గ్రామానికి వెళ్తున్న 108 వాహనం

నూతనకల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి క్రాస్‌రోడ్డు నుంచి అలుగునూరు గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా తయారైంది. గుంతలమయమైన దారి చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారుతోంది. ఈ దారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. శుక్రవారం అలుగునూరు నుంచి క్షతగాత్రులను ఆసుపత్రులకు చేర్చేందుకు వెళ్లిన 108 వాహనానికి తిప్పలు తప్పలేదు. గుంతలమయమైన రహదారిలో జారుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్థులు కోరారు.

ట్రాక్టర్ ఇసుక రూ.10 వేలు

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జోరుగా ఇసుక దందా కొనసాగుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.10 వేల వరకు పలుకుతోంది. మండలంలోని మక్తా కొత్తగూడెం, ఏపూర్, రామన్నగూడెం ఏటి నుంచి రాత్రీపగలు తేడా లేకుండా బాహాటంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా ఇసుక దందా ఆగడం లేదు. ఇటీవల భారీ వర్షాలు రావడంతో ఏటిలో వేగంగా నీటిప్రవాహం ఉన్నా నీళ్లలో దిగి ఇసుకను బయటకు తీస్తున్నారు. సమీపంలో కుప్పలుగా పోసి ట్రాక్టర్లలో నింపి రూ.8 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కొక్క ఇంటికీ 20 ట్రిప్పులు అవసరం ఉండగా ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు సగం డబ్బులు ఇసుకే ఖర్చు అవుతాయిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం మక్తాకొత్తగూడెంలో కూడలి గ్రామానికి చెందిన ట్రాక్టర్లు ఏటి నుంచి ఇసుక తీస్తుండగా గ్రామస్థులు, రైతులు అడ్డుకున్నప్పటికీ ఇసుక దందా ఆగడం లేదు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అనుమతులు ఇవ్వాలంటూ మండల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి, బహిరంగంగా ఇసుకను బయటకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్న అక్రమార్కులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను విక్రయించడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలం అవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. కిందిస్థాయి సిబ్బంది ఇసుక ట్రాక్టర్ల వద్ద చేతివాటానికి అలవాటు పడడం పరిపాటిగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.




ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న మహిళలు, మక్తా కొత్తగూడెం ఏటిలో నీటి నుంచి ఇసుక తీస్తున్న మహిళలు

తరలింపును కొంతమేర అరికట్టాం

మండలంలో ఏటి వెంట ఉన్న గ్రామాల్లో గతంలో ఇసుక అక్రమ రవాణా జరిగేది. ఇటీవలి ముక్కుడుదేవులపల్లి, ఏపూరు, రామన్నగూడెం గ్రామాల్లో ఇసుక తరలింపును కొంతమేర అరికట్టాం. మక్తాకొత్తగూడెంలో ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందిని పంపించాం. రాత్రి వేళ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల హత్య సంఘటనతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగింది. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం.
శ్రీకాంత్‌గౌడ్, ఎస్‌ఐ, ఆత్మకూరు(ఎస్)

పాడిపరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించాలి



గడ్డిపల్లి కేవీకేలో రైతులకు సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ బిందుమాధురి, నరేష్

గరిడేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధిపై రైతులు దృష్టి సారించాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త బిందు మాధురి అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాయలం, వరంగల్ జిల్లా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'యాంటీ మైక్రోబియల్ నిరోధకత-పరిష్కారాలు' అనే అంశంపై రైతులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు పాడిపశువులపై యాంటీ బయోటిక్స్ అతి వినియోగం చేయవద్దన్నారు. వాటి వినియోగంతో పశువులతో పాటు మానవుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని వివరించారు. పశువుల షెడ్డును శుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త, ఇన్‌చార్జి డీ నరేష్, డాక్టర్ అరుణజ్యోతి, సాయికిరణ్, డాక్టర్ అంబిక, డాక్టర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకళావేదిక కార్యనిర్వాహక కార్యదర్శిగా గజం ఉమాసత్య


గజం ఉమాసత్య

రామన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన కవయిత్రి గజం ఉమాసత్యను నియమిస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కత్తిమండ ప్రతాప్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమాసత్య అనేక కవితలు, రచనలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించడంతో పాటు మనోచైతన్యం అనే పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ శ్రీశ్రీకళావేదిక తెలుగు భాష సంస్కృతీ, వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల అభివృద్ధిపై కృషి చేస్తోందన్నారు. 36 ప్రపంచ రికార్డులను ఈ సంస్థ సాధించిందన్నారు. నిరంతరం సాహితీ కార్యక్రమాలతో ప్రపంచంలోని అతిపెద్ద సాహితీ సంస్థగా ఎదిగిందన్నారు. ఇలాంటి సాహితీ సంస్థకు రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి కోర్టులో జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని శుక్రవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టు నాయమూర్తి పీవీ రమణ ఎదుట హాజరుపర్చగా ఇద్దరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేల చొప్పున జరిమానా విధించారని, మిగిలిన నలుగురికి కలిపి రూ.4500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

15 ఏళ్లుగా విధులు.. రూ.13 వేలే వేతనం

- భారంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కుటుంబ పోషణ


ప్రసాద కౌంటర్లలో విధుల్లో నిమగ్నమైన బ్యాంకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

యాదగిరిగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పలు బ్యాంకుల తరపున విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చాలీచాలని వేతనంతో ఇబ్బందులు పడుతున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన 17 విభాగాలతో పాటు సెంట్రల్ బ్యాంకు ఇండియా(సీబీఐ), యూనియన్ బ్యాంకు ఇండియా(యూబీఐ), తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీజీబీ), స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) బ్యాంకులతో కూడా సేవలు అందిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో నాలుగు విభాగాల్లో 27 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. సీబీఐ బ్యాంకు ప్రసాదాల విభాగంలో 13 మంది, సువర్ణపుష్పార్చన విభాగం ముగ్గురు, యూబీఐ, టీజీజీబీలకు చెందిన 8మంది సిబ్బంది ప్రధాన బుకింగ్, ఎస్బీఐ తరపున అద్దె గదుల విభాగంలో ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి చాలీచాలని వేతనమే ప్రధాన సమస్యగా మారింది. 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా సిబ్బందికి మాత్రం రూ.13వేలకు మించలేదు. కొన్ని బ్యాంకులు రూ.7వేలే వేతనం ఇస్తున్నాయి. వీటితో సిబ్బంది కుటుంబపోషణకు చేయలేక ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలతో పోటీ పడలేక ఆర్థికంగా చితికిపోతున్నారు. వేతనం పెంచాలని బ్యాంకు మేనేజర్లను సంప్రదిస్తే పైనుంచి ఆమోదం రాలేదని చెబుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

ప్రమాదం అంచున ఆటో ప్రయాణం

- పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వైనం
- నామమాత్రంగా అధికారుల చర్యలు


ఆటో వెనకాల కూర్చున్న కూలీలు


పరిమితికి మించి బడిపిల్లలతో వెళ్తున్న ఆటో

నిడమనూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎలాగైనా సరే తొందరగా గమ్యం చేరాలనే ఆరాటం ప్రయాణికులది. కాస్త ఎక్కువ మందిని తరలిస్తే నాలుగు డబ్బులు సంపాదించాలనే బతుకు పోరాటం ఆటోవాలాలది. దీంతో నలుగురు ఎక్కాల్సిన ఆటోలో 25 మందిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగితే ప్రాణాలు నిలుపుకోవడం కష్టసాధ్యమవుతోంది. ప్రస్తుతం పత్తి ఏరే సీజన్ కావడంతో కూలీలు ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్లి పత్తి ఏరేందుకు ఆటోలో వెళ్తున్నారు. అయితే కూలీలు పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. కొందరు మహిళలు సైతం ఏమాత్రం భయం లేకుండా ఆటోపైన ఎక్కి కూర్చుంటున్నారు. ఆటో ప్రయాణం ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పడం లేదు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ మందితో ప్రయాణం చేస్తున్న ఆటోలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తుండటంతో ఆటో నిర్వాహకుల తీరు మారడం లేదు. ఇటీవల మండలంలోని ముప్పారం గ్రామంలో 20 మంది పత్తి కూలీలతో వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇలా తరచుగా ఏదో ఒకచోట ఆటో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమంది పిల్లలు సైతం లైసెన్స్ లేకున్నా ఆటోలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. ముఖ్యంగా కూలీలు, బడి పిల్లలతో వెళ్లే ఆటోలు కిక్కిరిసిపోతున్నాయి. నిబంధనల ప్రకారం పరిమితమైన వేగంతో, పరిమిత ప్రయాణికులతో ఆటోలు నడిపేలా అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోలు సీజ్ చేస్తున్నాం

పరిమితికి మించి ప్రయాణికులతో, అతివేగంగా తిరుగుతున్న ఆటోలను గుర్తించి సీజ్ చేస్తున్నాం. ఆటోవాలాలకు, ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరిగే వాహనాలపై చర్యలు తీసుకుంటున్నాం.
ఉప్పు సురేష్, నిడమనూరు ఎస్‌ఐ.

ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టివేత

కనగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. జీఎడవల్లి గ్రామ శివారులో బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ గుండబోయిన మేఘనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

● రామన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం తుమ్మలగూడెం సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మూసీ వాగు మూలగుట్ట సమీపంలో ఇసుక డంప్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలన్నారు.

మురిపించిన మంచు తెరలు


బ్రహ్మంగారిగుట్టపై ముసురుతో కమ్ముకున్న మేఘాలు



ఎడతెరిపి లేకుండా శుక్రవారం కురిసిన వర్షానికి నల్లగొండ జిల్లా కేంద్రం తడిసిముద్దయ్యింది. లతీఫ్‌సాహెబ్‌గుట్టతో పాటు మునుగోడు రహదారిలోని కాపురాలగుట్ట, బ్రహ్మంగారి గుట్టలు, పరిసరాలను మంచు తెరలు కమ్మేశాయి. హిమాయలయాలను తలపించిన మంచు తెరలు స్థానికులను ఆకట్టుకున్నాయి. పొరలు పొరలుగా కదులుతూ ఆహ్లాదాన్ని పంచాయి. మునుగోడు రహదారిలో వెళ్లే ప్రయాణికులు అటుగా చూస్తూ ఉండిపోయారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీడ్రైవర్ ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ లారీడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ అజయ్‌భార్గవ్ తెలిపిన వివరాలప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన పెడకంటి వెంకటయ్య(60) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మార్కెట్ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటయ్య ఆర్థిక, కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆయయన కుమారుడు అయ్యప్ప ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


రామలింగేశ్వరరావు

నాగార్జునసాగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. స్థానిక పైలాన్ కాలనీకి చెందిన ఆత్మకూరి రామలింగేశ్వరరావు గురువారం ఉదయం 9 గంటలకు శివాలయానికి వెళ్లొస్తానని భార్య లక్ష్మికి చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో శివాలయం వద్దకు వెళ్లగా అక్కడ రామలింగేశ్వరరావు ద్విచక్రవాహనం, చెప్పులు కనబడ్డాయి. దీంతో భార్య లక్ష్మి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సదరు వ్యక్తి కనిపిస్తే సెల్ నెంబరు 8712670197కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

పశువుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఎస్‌ఐ అజయ్‌భార్గవ్ తెలిపారు. కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాద్ బహదూర్‌పేటకు మినీ డీసీఎం వాహనంలో పశువులను అక్రమంగా తరలిస్తుండగా లక్కారం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు డ్రైవర్ జవ్వాజి రాము, యజమాని మహ్మద్ సమీర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిర్యాలగూడలో జాతీయ స్థాయి నాటక పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్లు సాంస్కృతిక కళాకేంద్ర పట్టణ ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి తెలిపారు. నందిని ఆర్ట్స్ - 2025 పేరుతో పద్య, శాస్త్రీయ, జానపద విభాగాల్లో 2026 మార్చి నెలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు నవంబరు 1వ తేదీ నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తులను 2026 జనవరిలో పరిశీలించి తుది పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులను పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, రామావతారం, ఉపేందర్, వీరప్రతాప్, ఎల్లయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు బస్సు సౌకర్యం

- *దేవరకొండ డిపో ఇన్‌చార్జి డీఎం సైదులు*

దేవరకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ డిపో నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులను నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఇన్‌చార్జి డిపో మేనేజర్ పడాల సైదులు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రామలింగేశ్వరస్వామి దేవాలయం, భీమవరం సోమేశ్వరస్వామి దేవాలయం, పాలకొల్లు క్షీర లింగేశ్వర స్వామి దేవాలయం, ద్రాక్షారామం, భీమేశ్వరస్వామి దేవాలయం, సమర్ల కోట లింగేశ్వరస్వామి దేవాలయాలను ఒకే రోజు దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా తిరుగు ప్రయాణంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పెద్దలకు రూ.2200 టిక్కెట్, పిల్లలకు రూ.1400 చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో ప్రతీ ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు కూడా ప్రత్యేకంగా భక్తుల కోసం బస్సులు నడపనున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

పెన్నా మధుసూదన్‌కు విద్వన్మణి పురస్కారం



చిన్నజీయర్‌స్వామి నుంచి పురస్కారం అందుకుంటున్న మధుసూదన్

నార్కట్‌పల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన ప్రముఖ సంస్కృత భాషా పండితులు, డాక్టర్ పెన్నా మధుసూదన్‌కు విద్వన్మణి పురస్కారం లభించింది. హైదరాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో గల చిన్నజీయర్‌స్వామి ఆశ్రమంలో గురువారం రాత్రి జరిగిన ఓ ఆధ్యాత్మిక సదస్సులో ఈ పురస్కారాన్ని పెన్నా మధుసూదన్‌కు చిన్నజీయర్ అందజేశారు. జీయర్‌స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్కృతభాషకు విశేషంగా సేవలందిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఇద్దరికి ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ అంజనీ మిశ్రా, సముద్రాల రంగ రామానుజచార్యులు, మైహోం రామేశ్వర్‌రావు తదితర ప్రముఖులు హాజరయ్యారు.

ఎస్ఆర్‌టీఆర్ఐ శిక్షణ

కార్యక్రమాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ)లో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణలతో పాటు ఉద్యోగం కల్పించేందుకు నిర్వహిస్తున్న పలు శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2 నెలల కాలపరిమితి కలిగిన బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్) శిక్షణ కార్యక్రమానికి ఇంటర్ పాస్ అయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులతో పాటు అర్హతల సర్టిఫికెట్ల జిరాక్సులు, 2 పాస్ ఫొటోలు, ఆధార్ కార్డుతో సంస్థలో నవంబరు 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి భువనగిరిలో బాలుర

అండర్-19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



వర్షంతో బురదమయంగా మారిన మైదానం

భువనగిరిటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 69వ బాలుర అండర్-19 ఇంటర్ కళాశాలల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నేటి నుంచి రెండు రోజుల పాటు భువనగిరిలో జరగనున్నాయి. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొననున్నాయి. ఇందుకోసం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాట్లు చేశారు. సుమారు 300 మంది క్రీడాకారులు, అధికారులు రానున్నారు. అలాగే ఈ టోర్నీలోనే రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేయనున్నారు. అయితే అకాల వర్షం నిర్వాహకులను, క్రీడాకారులను భయపెడుతుంది. క్రీడాభిమానులు పోటీలను విజయవంతం చేయాలని టోర్నీ కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాద్ కోరారు.

వైభవంగా సువర్ణ పుష్పార్చన

యాదగిరిగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు.

ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.13,76,469 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కార్తీకమాసంలో కొండకింద వ్రత మండపాల్లో 185 జంటలు వ్రతాలు నిర్వహించినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్‌రెడ్డి తెలిపారు.

తుఫానుకు వరిచేలు విలవిల

వరుస వర్షాలనుంచి తేరుకోకముందే వరిచేలపై శుక్రవారం మరోసారి భారీ వర్షం కురిసింది. దీంతో వరి, పత్తిచేలు కోలుకునే పరిస్థితి కనిపించడంలేదు. ధాన్యం ఆరబెడదామంటే వర్షం ఎడతెరిపి ఇవ్వడం లేదు. ధాన్యం రాశిలోనే నల్లబారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- పండుబారుతున్న పత్తిచేలు
- ధాన్యం ఆరక రైతుల తండ్లాట

తిరుమలగిరి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 4గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షానికి చేతికొచ్చిన పంటలన్నీ దెబ్బతిన్నాయి. చాలాచోట్ల పత్తి ఏరే దశలో ఉన్న చేలలో పత్తి అంతా తడిసి ముద్దయింది. కోతకొచ్చిన వరిచేన్లు నేలకొరిగాయి. ఈ వర్షంతో చేతికొచ్చిన పంటలన్నీ నాశనమయ్యాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు స్వయంగా ధాన్యం తడవకుండా వడ్లరాశులపై కవర్లు కప్పుకున్నారు. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నేరేడుచర్ల: మండలంలో ముందుగా నాట్లు వేసిన రైతుల పరిస్థితి



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

దారుణంగా ఉంది. రెండు నెలలుగా వర్షాలు విడిచి పెట్టక పోవడం ప్రస్తుతం తుపాను రావడంతో ఏపుగా పెరిగిన వరి పంట నేలపడిపోయింది. గాలి కొద్దిగానే ఉండడంతో పంట నష్టం తీవ్రత తక్కువగా ఉంది. ఇటీవల వరి పంటకు వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పురుగు మందుల పిచికారి ఎక్కువగా చేశారు. యూరియా కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వరి ఏపుగానే పెరిగి, వర్షాలకు నేలవాలింది. నర్సయ్యగూడెంలో ఒంటెద్దు ప్రభాకర్‌రెడ్డికి చెందిన 11 ఎకరాల పొలంలో వరిపంట నేలకొరిగింది. మండలం పరిధిలోని పలు గ్రామాలలో కూడా వరిపంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా రెండు రోజులపాటు వర్షాలు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో వరి పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.



నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెంలో అకాల వర్షంతో నేలవాలినవరి

కోదాడటౌన్/కోదాడ రూరల్: కోదాడ పట్టణంలో వర్షానికి పలు వీధులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. హుజూర్‌నగర్ రోడ్డు సూర్యల్యాట్ పక్కన గల వీధిలో వరద నీరు భారీగా చేరడంతో ఆ వీధుల గుండా వెళ్లే స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎకరాకు రూ. 20 వేలకు పైగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏవో కార్యాలయంలో వ్యవసాయాధికారి రజినీకి వినతిపత్రం అందజేశారు. రైతులు మాతంగి ప్రసాద్, ఏసుపాదం పాల్గొన్నారు.

అర్వపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్లు లేకపోవడంతో నీటిలో ధాన్యం కొట్టుకుపోతుంది. జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, అర్వపల్లి కేంద్రాలల్లో సన్నధాన్యం కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేశారు. అర్వపల్లి కేంద్రంలో దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. త్వరగా కాంటాలు వేయాలని రైతులు కోరుతున్నారు.

తుంగతుర్తి : వర్షంతో పాటు గాలి రావడంతో వరి చాలా ప్రాంతాల్లో వరి నేల వాలింది. దీంతో వరి కోయడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. పెట్టిన పెట్టుబడి కూడా రాదేమో అని ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు ఒకసారి ఎండ బెట్టడం మరోసారి వర్షం పడడం దీంతో రైతులు బాధ వర్ణనాతీతం. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వెంటనే కాంటాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మోత్కూరు: తడిసిన ధాన్యం

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి ఆ గ్రామం నుంచి ముశిపట్ల, రాయిబావి గ్రామాలకు, ఇతర కాలనీలకు వెళ్లే వీధులు జలమయమయ్యాయి. రోడ్ల వెంట ద్విచక్ర వాహనాలపై ముశిపట్ల, రాయిబావి గ్రామాలకు వేళ్లే వారు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సంబంధిత ఉన్నతాధికారులు కాంట్రాకర్‌పై చర్య తీసుకుని దారిలో నిలిచే నీరు డ్రైనేజీలోకి వేళ్లేలా ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు, పలు కొనుగోలు కేంద్రాలల్లో పోసిన ధాన్యం రాశులు తడిశాయి. వరంతో వరి కోతలకు, పత్తి తీయడానికి అంతరాయం ఏర్పడింది.

ధాన్యం తడవకుండా జాగ్రత్తపడాలి



వర్ధమానుకోట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హరికిషోర్ శర్మ

నాగారం : తుఫాన్ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని తడవకూండా టార్పాలిన్స్‌తో కాపాడుకోవాలని తహసీల్దార్ హరికిషోర్ శర్మ రైతులకు సూచించారు. శుక్రవారం వర్ధమానుకోట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తఫాన్ కారణంగా రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యంపై పట్టాలతో కప్పి ఉంచాలని కోరారు. లోతట్టులో నీరు నిల్వ ఉండకూండా కాల్వలు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. త్వరలోనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకన్న, ఆర్ఐ బాబు, ఐకేపీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నల్లబారిన తెల్లబంగారం



చేనుపై నల్లబారుతున్న పత్తి

మేళ్లచెర్వు: అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీతకు సిద్ధంగా ఉన్న పత్తి తడిసి కాయలు పగలకుండానే కొన్ని చెట్టు పైన కుళ్లిపోగా కొంత తడిసి గింజలు మొలకలు రాగా...మిగిలిన పత్తి రంగు మారి నల్లబారింది. పత్తి విత్తిన నాటి నుంచి వర్షాలు అనావృష్టితో పాటుగా తెగుళ్ల బారిన పడి పూత, కాత రాలిపోయింది. ఉన్న కాస్త.. పత్తి వర్షాలకు తడిసి వర్షార్పణం అయిపోయింది.

ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు

- *డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి*



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడురూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవద్దని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కచలాపురం, ఊకొండి గ్రామాల్లో మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అకాల వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చే ధాన్యం తేమశాతం 17శాతం ఉండే విధంగా తాలు, మట్టి పెళ్లలు లేకుండా శుభ్రంగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర గ్రేడ్ ఏ రూ.2389 సాధారణ రకం రూ.2369లు సన్న వరి ధాన్యానికి రూ.500బోనస్ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు నిబంధనలను పాటించి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, హైమద్, అగ్రికల్చర్ ఏవో పద్మజ, సంఘం డైరెక్టర్లు ఉప్పునూతల రమేష్, మార్తా మోహన్‌రెడ్డి, మేకల మల్లయ్య, సింగం వెంకన్న, జిట్టగోని యాదయ్య, ఏఈవో నికిల్, సంఘం కార్యదర్శి సుఖేందర్, అశోక్‌రెడ్డి, పురుషోత్తం, స్వామినాథ్, లింగస్వామి, చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు బీమనపల్లి సైదులు, జాల వెంకటేశ్వర్లు గురజా రామచంద్రం, కొండకింది రాంరెడ్డి, మేడి యాదయ్య, యాదగిరి, దేవలోకం, స్వామి, బీమగోని ముత్యాలు, నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో జాబ్‌మేళాకు భారీ ఏర్పాట్లు

- *ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ఉత్తమ్, కలెక్టర్, ఎస్పీ*
- *జాబ్‌మేళాకు వచ్చే వారికి భోజన వసతి ఏర్పాట్లు*
- *40 వేల మంది నిరుద్యోగులు వచ్చే అవకాశం*



జాబ్‌మేళా కోసం ఏర్పాటు చేస్తున్న వాటర్ ప్రూఫ్ టెంట్లు

హుజూర్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు భారీ ఏర్పాట్లు చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మూడు రోజుల పాటు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆయనతో పాటు కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, ఎస్‌పీ నర్సింహ వారం రోజులుగా ఏర్పాట్లు చేయించారు. జిల్లా అధికార యంత్రాంగం వారం రోజులుగా హుజూర్‌నగర్‌లో తిష్టవేసి మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు చేశారు. జాబ్‌మేళాకు 40 వేల మంది పైచిలుకు నిరుద్యోగులు హాజరయ్యే అవకాశం ఉంది. యువతీ, యువకులకు భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. సింగరేణి కాలరీస్, తెలంగాణ పరిశ్రమలు, డీట్ శాఖల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో మొట్టమొదటిసారిగా ఉమ్మడి జిల్లా స్థాయిలో 5వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్రంలోని 275 కంపెనీలను ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం నాటికే 36వేల మందికి పైగా యువతీ, యువకులు ఉద్యోగ, ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. శని, ఆదివారాలలో జాబ్‌మేళాకు వచ్చే యువకులు 10వేల మందికి పైగా జాబ్‌మేళా ప్రాంగణంలో పేర్లు నమోదు చేసుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేశారు. సోషల్, డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వ యంత్రాంగం జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం చేపట్టింది. ఉమ్మడి జిల్లాలోని సిమెంట్, ఫార్మా కంపెనీలు కూడా జాబ్‌మేళాకు రానున్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని పాత విజ్ఞాన్ స్కూల్ ఆవరణ, స్వర్ణవేదిక ఆవరణలలో అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవడం, కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. శనివారం ఒక్కరోజే జాబ్‌మేళా నిర్వహించాలని మొదట నిర్ణయించగా యువత నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడంతో రెండు రోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కంపెనీల ప్రతినిధులకు తోడుగా మునిసిపల్, పంచాయతీరాజ్, రెవెన్యూశాఖల ఉద్యోగులను సహాయకులుగా నియమించారు. సుమారు 500 మంది పోలీసులతో ఎస్పీ నర్సింహ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చే నిరుద్యోగులకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రాంగణాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీస్ యంత్రాంగం సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ

నేడు మార్కెట్ మడిగెల వేలంపాట

చిట్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో భువనగిరి రోడ్డులో నిర్మించిన మడిగెలకు శనివారం వేలంపాట నిర్వహించనున్నారు. మొత్తం 30మడిగెలకు గాను 80 దరఖాస్తులు వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి జానయ్య తెలిపారు. ఉదయం 11గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందని దరఖాస్తు చేసుకున్న వారంతా సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 9, పీహెచ్‌సీకి 1, జనరల్‌కు 12 మడిగెలు కేటాయించినట్లు తెలిపారు.

ప్రైవేట్ బస్ ప్రమాదం దురదృష్టకరం : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాలో శుక్రవారం జరిగిన ప్రైవేట్ బస్సు ఘోర ప్రమాదం కలిచివేసిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన జరగటం దురదృష్టకరమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, బాధిత కుటుంబాలకు ధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పర్యటన

నాంపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంలో ఈ నెల 25న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలకేంద్రంలో మర్రిగూడ రోడ్డు నుంచి గుర్రంపోడు రోడ్డు వరకు రూ.24 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల రోడ్డు, ఫుట్‌పాత్, హైమాస్ట్ లైట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం పసునూరు నుంచి హైదరాబాద్ సాగర్ రోడ్డు వెంకటంపేట స్టేజీ వరకు రూ.25 కోట్ల వ్యయంతో రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. జతెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

ఉపాధిహామీ ఇన్‌చార్జి ఏపీవోగా రమణయ్య

కేతేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం మండల ఇన్‌చార్జి ఏపీవోగా నకిరేకల్ మండల ఏపీవో ఆర్.రమణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లుగా సీనియర్ టీఏ ఎస్.సురేందర్ ఇక్కడ తాత్కాలిక ఏపీవోగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నియమించిన సీనియర్ టీఏలను తాత్కాలిక ఏపీవో బాధ్యతల నుంచి తప్పించాలన్న టీఏల సంఘం విజ్ఞప్తి మేరకు డీఆర్డీవో అధికారులు సురేందర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించినట్లు తెలుస్తుంది.

పిల్లలను ప్రయోజకులను చేసిన లింగమ్మ

● మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి



తుడిమిడిలో ఆలేటి లింగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

శాలిగౌరారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో ఉండి కూడా ఆలేటి లింగమ్మ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులు చేసిందని మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుడిమిడి గ్రామానికి చెందిన పవన్‌సాయి హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్ మాతృమూర్తి ఆలేటి లింగమ్మ ఇటీవల మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం తుడిమిడి గ్రామంలో మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆలేటి మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి మాట్లాడుతూ ఆమె మృతి కుటుంబానికి తీరని లోటన్నారు. వారి వెంట పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజిలాల్ శేఖర్ బాబు, రాచకొండ గణేష్, చాలకాని కొమరయ్య, బాకీ వెంకన్న, తీగల వెంకన్న, చౌగోని అశోక్, మాగి రవి తదితరులు పాల్గొన్నారు.

శివన్నగూడలో పశు వైద్యశిబిరం



శివన్నగూడలో పశువులకు వైద్య చికిత్స చేస్తున్న డాక్టర్ సురేందర్, యమున

మర్రిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారులు సురేందర్, యమున అన్నారు. మండలంలోని శివన్నగూడలో శుక్రవారం పశువైద్య, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గాలికుంటు, సీజనల్ వ్యాధులు సోకకుండా వ్యాధుల నివారణ కోసం టీకాలు వేయించాలన్నారు. అదేవిధంగా పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించాలని రైతులకు సూచించారు. 256 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో నీజామొద్దీన్, సుధాకర్, ఏల్లేష్‌లు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

నకిరేకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం రుద్రాక్షి పుష్పయాదగిరి దంపతులకు ప్రభుత్వం ద్వారా సన్నబియ్యం వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశంను వారి గుడిసెకు ఆహ్వానించి సన్నబియ్యంతో అన్నం పెట్టారు. ఆ సమయంలో వారి కుటుంబ పరిస్థితి, వారి నివాసాన్ని చూసి చలించిపోయిన ఎమ్మెల్యే ఆ కుటుంబానికి తనవంతు సాయం చేయాలని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారు. అంతేకాక ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి శంకుస్థాపన చేశారు. అసలే పేద కుటుంబం ఇళ్లు ఎలా కట్టుకుంటారని గ్రామస్థులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ కుటుంబానికి తనవంతుగా రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. సన్నబియ్యంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి, ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం

మర్రిగూడ: ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ సూచన మేరకు ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ శుక్రవారం నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీరప్ప, కొండూరు శేఖర్, రవి, కర్నాటి వీరేష్ గౌడ్, బొజ్జనగోని శ్రీకాంత్, ఇస్మార్ట్ అంజర్, కర్నాటి శివ గౌడ్, సలీం, అంజనేయులు, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

నాగఫణీంద్రకు ఓయూ పీహెచ్‌డీ పట్టా



నాగఫణీంద్ర

కనగల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన పగడీజు నాగఫణీంద్ర హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జియాలజికల్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఓయూ ప్రొఫెసర్ జి.ప్రభాకర్ పర్యవేక్షణలో నాగఫణీంద్ర నల్లగొండ జిల్లా చండూరు మండలంలో రిమోట్ సెన్సింగ్, జియాలజీ, జియోఫిజికల్ సర్వే, హైడ్రోలాజికల్, జియో కెమికల్ స్టడీస్‌లో పొటెన్షియల్ జోన్ల గుర్తింపును విజయవంతంగా పూర్తి చేశాడు. అతని పరిశోధనలో ఆ ప్రాంతంలో ఫ్లోరైడ్, నైట్రేట్లు, సోడియం స్థాయి అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. అదే విధంగా భూగర్భ జల వినియోగం అధికంగా ఉన్నట్లు తెలిసింది. నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదువుతున్న నాగఫణీంద్రను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

ఆడుకునేదెలా

» క్రీడా ప్రాంగణాలు లేక ఇబ్బందులు » ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు, యువత





చిట్యాలలోని ఓ వెంచర్‌లో క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలం

సీసీ రోడ్డుపై కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

చిట్యాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలో క్రీడా మైదానం లేక యువత, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం సమయంలో, సెలవు రోజుల్లో ఆడుకోవడానికి స్థలం లేకుండా పోయింది. దీంతో యువత, విద్యార్థులకు ఎటు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ప్రతీ గ్రామంలో ఒక ఉత్సవం లేక సమావేశం నిర్వహించుకోవడానికి అనువైన స్థలం ఉంటుంది కానీ చిట్యాలలో ఆ పరిస్థితి లేదు. తప్పనిసరిగా ఏదైనా కార్యక్రమంలో చేసుకోవాలనుకుంటే రోడ్ల మీదే చేయాల్సిందే. గత ప్రభుత్వంలో క్రీడా మైదానం కోసం ఓ ప్రైవేట్ వెంచర్‌లో గుట్ట సమీపంలో కొంత స్థలం కేటాయించినా దానికి అతీగతీ లేదు. ఆ స్థలంలోనే ప్రస్తుతం అమృత్ స్కీం కింద వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియం ఏదీ లేకపోవడంతో ఆటలాడే పరిస్థితి లేదు. మైదానాలు లేక యువత ఫోన్ గేమ్స్‌తో పాటు యువత పెడదారి పడుతున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. చిట్యాలలో 15వేలకు పైగా జనాభా ఉన్నా ఒక్క స్టేడియం కూడా లేకపోవడం శోచనీయం. దీని పై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ స్పందించడం లేదు. గతంలో చిట్యాల హైస్కూల్, వ్యవసాయ మార్కెట్‌లో ఆటలాడేవారు లేదంటే ఊరి బయట ఉన్న పొలాల్లో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించేవారు. మార్కెట్ ఆవరణలో మొక్కలు నాటడం, ఉన్న ఖాళీ స్థలంలో సీసీ కల్లాలు నిర్మించడంతో మార్కెట్‌లో ఆటలు ఆడటానికి అవకాశం లేకుండాపోయింది. ఎంతో కొంత స్థలం ఉన్న హైస్కూల్ గ్రౌండ్ హైవే విస్తరణలో పోవడం అలాగే నూతన భవనాలు నిర్మించడంతో కుంచించుకుపోయింది. ఇక ఊరి బయట అన్ని వెంచర్లుగా మారడంతో చిట్యాల పట్టణ యువత, విద్యార్థులకు ఆటల మైదానాలు కరువయ్యాయి.

ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు ఏర్పాటు చేయాలి



చిట్యాల పట్టణంలో త్వరితగతిన ఒక అవుట్‌డోర్, ఒక ఇండోర్ స్టేడియం నిర్మించాలి. స్టేడియాలు లేకపోవడంతో విద్యార్థులు ఆటాలడుకునే పరిస్థితి లేదు. దీంతో యువత పెడదారి పట్టే అవకాశం ఉంది.

-సూర్య, ఏబీవీపీ నాయకుడు, చిట్యాల

వెంటనే క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి



చిట్యాల పట్టణంలో వెంటనే అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి. క్రీడల్లో శిక్షణ ఇస్తే విద్యార్థులు రాణించగలుగుతారు. ఉల్లాసంగా, ఉత్సాహం గడుపుతారు.

- ఏనుగు నర్సిరెడ్డి, చిట్యాల

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ఆటలాడితేనే యువత, విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారు. క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుంది. ఎంతో ప్రాధాన్యమైన క్రీడలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడాన్ని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిట్యాల పట్టణంలో యువత గంజాయికి బానిసలవుతున్నారు. వారందరికీ కౌన్సిలింగ్ ఇచ్చి క్రీడల్లో పోత్సహిస్తే కొంత మారే అవకాశం కూడా ఉండవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు. ఇక కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అసలు ఆట మైదానాలే లేవు. ఆటల్లో రాణించాలని ఊదరగొడుతున్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు క్రీడా వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. చిట్యాల పట్టణంలో ఒక అవుట్‌డోర్ స్టేడియం, ఒక ఇండోర్ స్టేడియం నిర్మించాలని పట్టణ ప్రజలు, యువకులు, విద్యార్థులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే వేముల వీరేశం



కట్టంగూరు: సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని చౌ డంపల్లి గ్రామంలోని వరలక్ష్మీ కాటన్‌మిల్లులో శుక్రవారం ఆయన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులంతా పత్తిని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తిని దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. వర్షాల కారణంగా పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, తేమశాతం పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని రైతులు ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఐతరాజు యాదయ్య, దార యాదయ్య, కాటన్ మిల్ యజమాని శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, శ్రీనివాస్ రెడ్డి, సీసీఐ ఇన్‌చార్జి కోటేశ్వర్‌రావు, మార్కెట్ సెక్రటరీ జానయ్య పాల్గొన్నారు.

కట్టంగూరు: సీసీఐ కేంద్రాలు రైతులకు అండగా ఉంటాయని, కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం మండలంలోని అయిటిపాముల గ్రామంలోని కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ వ్యాపారులను ప్రోత్సహించవద్దని సూచించారు. సీసీఐ కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు బెజవాడ సైదులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

మర్రిగూడ: రైతులు కష్టపడి పండించిన పత్తిని దళారులకు విక్రయించి నష్టపోవద్దని మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని యరగండ్లపల్లి గ్రామ సమీపంలోని లక్ష్మీనర్సింహస్వామి మిల్లులో శుక్రవారం ఆమె సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో సహస్ర, వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, డైరెక్టర్లు మల్లేష్, జముల వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, నాయకులు యాదయ్య, రవీందర్‌రావు, వెంకటయ్య, జగాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తిప్పర్తి: రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామలింగాలగూడెం వద్ద ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవితో కలిసి ప్రారంభించారు. తేమశాతానికి అనుగుణంగా మద్దతు ధరను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, గుండా సత్యనారాయణ, వాడాల జానయ్య, శ్రీరాములు, మార్కెట్ కమిటి సిబ్బంది పాల్గొన్నారు.



సదరం క్యాంపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాణ్యతా ప్రమాణాలతో
తెస్తే మద్దతు ధర

(5వ పేజీ తరువాయి)

పౌర సరఫరాలశాఖ డీఎం గోపికృష్ణ, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, చండూరు ఏఎంసీ చైర్మన్ దోటి నారాయణ, తహసీల్దార్ నరేష్ నేలపట్ల, ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, సీసీఐ బయ్యర్ బాలాజీ నింజే, ఏఎంసీ సెక్రటరీ కె.రవి, గిర్దావర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో దివ్యాంగులకు ధ్రువపత్రాల జారీ కేంద్రం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం ఈ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కాగా, ఈ కేంద్రాన్ని రూ.15లక్షలతో ఆధునీకరిస్తున్నారు. వాల్ పెయింటింగ్స్, వైద్యులు, రోగులు విడివిడిగా వేచి ఉండేందుకు విభాగాలు, మరుగుదొడ్లు, కుర్చీలు, ఫ్యాన్లు తదితర సౌకర్యాల కల్పన పూర్తయింది. ఆధునీకరణ పనులు చివరి దశకు చేరుకోగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, ఆర్ఎంవో డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్లు రత్న, స్వప్న, రజని, వినయ్, తదితరులు ఉన్నారు.

నియామకం రద్దు

నార్కట్‌పల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్‌గా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి గ్రామానికి చెందిన గోలి శ్రావణిరెడ్డిని నియమిస్తూ ఇచ్చిన నియామక ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రచార కమిటీ చైర్మన్ పోలగోని వెంకటేశ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ బాధ్యుల నుంచి వచ్చిన అభ్యంతరం మేరకు ఆ నియామకాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సందిగ్ధం

జిల్లా	ధాన్యంఉత్పత్తి	కొనుగోలు లక్ష్యం
(లక్షల మెట్రిక్ టన్నుల్లో)		
నల్లగొండ	12.00	6.00
సూర్యాపేట	11.98	4.37
యాదాద్రి	6.00	4.00
మొత్తం	29.98	14.37

(5వ పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు.

బాయిల్డ్ రైస్ తరలిస్తేనే..

ఉమ్మడి జిల్లాలో మిల్లులకు యాసంగి సీజన్‌లో సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యానికి సంబంధించి ఇంకా 40శాతం మేర బియ్యం మిల్లుల్లోనే నిల్వ ఉంది. ఈ బియ్యాన్ని పూర్తిగా సేకరిస్తే నిల్వ చేసేందుకు గోదాములు లేకపోవడంతో, ప్రభుత్వం సైతం ఈ బియ్యం అప్పగించాలని ఆదేశించలేని పరిస్థితి నెలకొంది. గోదాముల్లో నిల్వ ఉన్న బాయిల్డ్ రైస్‌ను ఎఫ్‌సీఐ తరలించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఎఫ్‌సీఐ నుంచి ర్యాక్‌మూమెంట్ లేకపోవడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యం ఉండగా, వాటిల్లో వంద శాతం మేర నిల్వలు పేరుకుపోయాయని తెలిసింది. అందులో ఎఫ్‌సీఐ తీసుకోవాల్సిన 2,46,267 మెట్రిక్ టన్నుల బియ్యానికి అనుమతులు తీసుకోవడంతో పాటు, రవాణాకు సంబంధించిన రైల్వే ర్యాకులు వచ్చేలా చర్యలు తీసుకోకపోతే ఈ సీజన్‌లో ఆయకట్టు నుంచి ధాన్యం వచ్చే సమయానికి కొనుగోళ్లలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ప్రస్తుతానికి మార్కెటింగ్ శాఖ పరిధిలోని గోదాములనైనా వానాకాలం ధాన్యం నిల్వకు కేటాయించేందుకు అధికారయంత్రాంగం కసరత్తు చేస్తోంది. మార్కెటింగ్‌శాఖ పరిధిలోని గోదాములతో పాటు, అవసరమైతే ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకొని నిల్వచేసేందుకు చర్యలు తీసుకోవాలనే సూచనలు ఇటు మిల్లర్ల నుంచి అటు రైతుల నుంచి వస్తున్నాయి.

14.37లక్షల మెట్రిక్‌టన్నుల కొనుగోలు లక్ష్యం

వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 29.98లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా, అందులో 14.37లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 1,000కి పైచిలుకు కొనుగోలుకేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్‌లో సన్నధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో ఈ రకాలు అధికంగా మిల్ పాయింట్ల వద్దే విక్రయమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎడతెరిపిలేని ముసురు

- శాలిగౌరారంలో 9 సెంటీమీటర్ల వర్షం
- నేల కొరిగిన వరి చేలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- అన్నదాతల ఇబ్బందులు



ఇనుపాముల ఐకేపీలో వర్షం నీటితో కలిసి కొట్టుకుపోతున్న ధాన్యం



కేతేపల్లి: గుడివాడ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

కేతేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురిసింది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నా వర్షం కురవలేదు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతం లో ప్రారంభమైన వర్షపు జల్లులు సాయంత్రం వరకు రోజంతా విడవకుండా కురుస్తూనే ఉన్నాయి. దీంతో చేతికొచ్చిన పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. కోతకొచ్చిన వరి పంట నేల కొరిగిపోయింది. అలాగే పత్తి చెట్లపైనే తడిసి ముద్దయింది. ఇదిలా ఉంటే మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షం నీరు నిలిచి రైతుల ధాన్యంరాశులు తడిసిపోయాయి. కొత్తపేట, గుడివాడ గ్రామాల్లో వర్షం అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల్లో వర్షపు నీరు వరదలై పారింది. వర్ష తీవ్రతతో కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం రాశులు నీళ్లలో మునిగి ధాన్యం వర్షపు నీటితో కొట్టుకుపోయింది. వర్షాలు కురిసే వీలుందని వాతావరణశాఖ హెచ్చరిస్తున్నా అధికారులు అవసరమైన మేర పట్టాలు అందించకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన తమ ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని, కొట్టుకుపోయిన ధాన్యానికి నష్టపరిహారం అందించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.




శాలిగౌరారంలో నెలకొరిగిన వరి చేను

శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: శాలిగౌరారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. రోజంతా వర్షం పడటంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదాపు 9 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. ఈ వర్షానికి చేతికొచ్చిన వరి చేలు నేలకొరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. శాలిగౌరారం మాదారం రహదారిలో ఉట్కూరు వద్ద కాజ్‌వేపై వరద నీరు భారీగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షానికి కలిగిన నష్టానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



శాలిగౌరారం: మాదారం రహదారిలో ఉట్కూర్ వద్ద కాజ్‌వేపై భారీగా ప్రవహిస్తున్న వరద నీరు



గరిష్ఠం 28.0
కనిష్ఠం 22.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.10 (305.5646)	46,748	46,748
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	2,551.83	2,860.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

ధాన్యం కొనుగోళ్లపై.. సందిగ్ధం

- క్షేత్రస్థాయిలో పలు అవరోధాలు
- మిల్లుల్లో పేరుకుపోయిన యాసంగి బియ్యం
- ఆ నిల్వలను తరలించకపోతే ఇబ్బందులేననే సంకేతాలు
- సన్నధాన్యం మిల్‌పాయింట్ల వద్ద విక్రయానికే రైతుల మొగ్గు
- ధర తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగడంపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఆటంకాలను పరిష్కరించలేకపోతే, ధాన్యం ఉధృతి ప్రారంభమయ్యాక ఇబ్బందులు ఏర్పడుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

జిల్లాలోని రైస్ మిల్లుల్లో ఇప్పటికే యాసంగి ధాన్యాన్ని పేరుకుపోయి ఖాళీ జాగా లేదు. దీంతో ప్రభుత్వం వానాకాలం సీఎంఆర్ కోసం ఇచ్చే ధాన్యం దిగుమతిలో మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తే దీని ప్రభావం తమపై పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని, లేదంటే కొనుగోళ్లలో ఇబ్బందులు తప్పవని అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యతో పాటు మిల్‌పాయింట్ల వద్ద సన్నధాన్యాన్ని నేరుగా కొనుగోలుచేస్తుండటంతో నాణ్యత పేరుతో ధర తగ్గిస్తున్నారని, మిల్‌పాయింట్ల వద్ద కొనుగోళ్లు కొనసాగినంత కాలం రెవెన్యూ ఉద్యోగులను నియమించాలని రైతులు కోరుతున్నారు. పోలీసులు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, తూనికలు కొలతలశాఖ అధికారులు బృందంగా ఏర్పడి తరచూ మిల్‌పాయింట్లను తనిఖీ చేయాలని రైతులు పేర్కొంటున్నారు.

మిల్‌పాయింట్లకే సన్నధాన్యం

సన్నధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు మాత్రం మిల్‌పాయింట్ల వద్దకే నేరుగా తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఈసారి ధాన్యం బిల్లులతో పాటు, బోనస్ కలిపే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు మాత్రం మిల్‌పాయింట్లకు తరలించేందుకే మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం మూసీ ఆయకట్టుతో పాటు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో బోరుబావుల కింద సాగైన వరి కోతలు పూర్తవడంతో ఆ ధాన్యం మార్కెట్‌కు వస్తోంది. ప్రధానంగా యాదాద్రి జిల్లాతో పాటు, నల్లగొండ జిల్లాలోని చిట్యాల, కట్టంగూరు, నార్కట్‌పల్లి, కనగల్, నల్లగొండ, ఇతర నాన్ ఆయకట్టు ప్రాంతాల నుంచి మిర్యాలగూడ మిల్లులకు ధాన్యం వస్తోంది. మరోవైపు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేసింది. గ్రేడ్-1 ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2,389ఉండగా, ప్రస్తుతం మిల్‌పాయింట్ల వద్ద కనిష్ఠంగా రూ.2,200 నుంచి గరిష్ఠంగా రూ.2,450 వరకు చెల్లిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉండడం, పచ్చిధాన్యమే కొనుగోలు చేస్తుండడంతో ధర తగ్గించినా రైతులు మిల్లుపాయింట్ల వద్దే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా నాణ్యమైన ధాన్యానికి కూడా ధర తగ్గిస్తున్నారని, దీన్ని కట్టడిచేసేందుకు మిల్‌పాయింట్ల వద్ద గత సీజన్‌లో ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ ఉద్యోగులను నియమించాలని రైతులు కోరుతున్నారు.ఈ సీజన్‌లో ప్రస్తుతం జైశ్రీరామ్(చింటు, పూజాగోల్డ్, చిట్టిపొట్టి)రకం ధాన్యంతో పాటు,హెచ్ఎంటీ-505 రకం ధాన్యం ఎక్కువగా దిగుబడి వచ్చింది.

ధర తగ్గడంతో కామన్ వెరైటీల కొనుగోళ్లు నిల్

కామన్ వెరైటీలైన ఎంటీయూ-1010 వంటి రకాలను మిల్లర్లు కొనుగోలు చేయడంలేదు. ఈ రకం బియ్యానికి పోర్టుల వద్దకు డెలివరీ ఇచ్చినా క్వింటాకు రూ.2,940 మాత్రమే ధర లభిస్తుండడంతో, ఆ మేరకు ధాన్యం ధర తగ్గించాల్సి ఉండడంతో మిల్లర్లు కొనుగోళ్లను నిలిపేశారు. సీజన్ ఆరంభం కావడం, సన్నధాన్యం వస్తుండడంతో సన్నరకాలపైనే మిల్లర్లు దృష్టి సారించారు. అయితే ఈ రకాలను ప్రభుత్వరంగ సంస్థలు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటంతో, ఆ ధాన్యాన్ని కేటాయించిన మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని రైతులు....

- మిగతా 8వ పేజీలో...

నాణ్యతా ప్రమాణాలతో తెస్తే మద్దతు ధర



మునుగోడులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యతా ప్రమాణాలతో పంట ఉత్పత్తులు తీసుకువస్తే మద్దతు ధర లభిస్తుందని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మునుగోడులోని సలాసర్ బాలాజీ పత్తి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం, నాణ్యత, మిల్లులో వేబ్రిడ్జి తూకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొత్తగా 'కిసాన్ కపాస్' యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌తో మాత్రమే పత్తి కొనుగోళ్లు జరుగుతాయన్నారు. నాణ్యత ఉన్న పంట విక్రయ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా ఒకే రోజున సులువుగా పూర్తవుతుందన్నారు. సీజన్‌లో ఒక రైతు మూడు దఫాలుగా స్లాట్ బుక్ చేసుకోవచ్చని, ఏదేని కారణాలతో బుకింగ్‌ను కూడా రద్దు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలోనే మునుగోడు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో 19 వేల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు సామర్థ్యం ఉందన్నారు. గతంలో ఎల్-1 కేంద్రంగా ఉండటంతో ఇతర జిల్లాల పత్తిని ఇక్కడ విక్రయించేవారని, దీంతో ఇక్కడి రైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కొత్త విధానం ద్వారా అలాంటి సమస్యలు ఉండవన్నారు. కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి...

- మిగతా 8వ పేజీలో...

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఎస్పీ శరత్ చంద్ర పవార్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రౌడీ షీటర్లకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన మాట్లాడారు. రౌడీషీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఊరుకునేది లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఆర్థిక, భూ సెటిల్‌మెంట్ల పేరుతో సామాన్య ప్రజలను దౌర్జన్యాలు, బెదిరింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రతీ కదలికను పరిశీలించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ హరిబాబు, టూటౌన్ ఎస్ఐ సైదులు, రూరల్ ఎస్ఐ సైదాబాబు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణదాతలు కావాలన్నారు.

అనంతరం జిల్లా వ్యాప్తంగా పోలీసులతో పాటు యువకులు ఎక్కువ సంఖ్యలో హాజరై 150 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐలు సంతోష్, శ్రీను, హరిబాబు, ఆర్ఎస్ఐలు కల్యాణ్, రాజీవ్, సాయిరాం, సంతోష్, అశోక్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 275 పరిశ్రమల ప్రతినిధులు

- ఆదివారం కూడా నిర్వహించాలని నిర్ణయం
- రెండు రోజుల పాటు నిర్వహణ
- 40 వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యే అవకాశం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జాబ్‌మేళా ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న మెగాజాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభిస్తోందని, రాష్ట్రంలోని 275 పరిశ్రమలప్రతినిధులు హాజరుకానున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. అంతకుముందు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టణంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహాతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడమే మెగాజాబ్‌మేళా లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జాబ్‌మేళా నిర్వహించి పల్లె ప్రాంతాల్లో చదువుకున్న యువతీ, యువకులకు ఉద్యోగం కల్పించి వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జాబ్‌మేళాకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 36వేల మంది నిరుద్యోగులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, ఇది 40వేలకు పెరిగే అవకాశం ఉందన్నారు. దేశంలోని ప్రముఖ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. సుమారు 270 కంపెనీలు నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలు రెండురోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. నిరుద్యోగులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దనే ఈ అవకాశం కల్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 80వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం పాటుపడుతున్నామన్నారు. యువతీ, యువకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని రెండురోజులు జాబ్‌మేళాకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు కూడా జాబ్‌మేళా వద్ద పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. జాబ్‌మేళాకు వచ్చే యువతీ, యువకులు ఒత్తిడికి లోనుకాకుండా క్రమశిక్షణ పాటించి ఇంటర్వ్యూలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతంలోని గ్రామీణ యువతకు మెరుగైన ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు. 275 పరిశ్రమలు ఈ జాబ్‌మేళాలో పాల్గొని అర్హతను బట్టి ఉపాధి కల్పిస్తాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని సిమెంట్, ఫార్మ కంపెనీలలో కూడా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనుకున్నదాని కన్నా ఎక్కువ స్థాయిలో నిరుద్యోగులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రకారం 36వేలు దాటగా మరో 10వేల మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఆర్డీవోలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, జిల్లా ఉన్నతాధికారులతో పాటు తన్నీరు మల్లీకార్జున్‌రావు, సర్వోత్తంరెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, ఈద్పుగంటి సుబ్బారావు, గూడెపు శ్రీను, గెల్లి రవి, దొంతగాని శ్రీనివాస్, పోతు భాస్కర్, వేణారెడ్డి, అరుణ్‌కుమార్, అజీజ్‌పాషా, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

అడవిదేవులపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి, బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించి వీఎల్ఆర్ పొందాలని డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తీసుకున్న రుణాలను చెల్లించి ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని పొందాలన్నారు. అర్హత ఉన్న సభ్యులతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని, అందుకు ప్రతీ ఇంటికి వెళ్లి సంఘంలో లేని సభ్యులను గుర్తించాలన్నారు. ఈ ఏడాది వృద్ధ మహిళలు, దివ్యాంగులు, కిశోర బాలికలతో సంఘాలుగా ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. వారికి బ్యాంక్ రుణాలు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతీ వీవోఏ సాధించాలన్నారు. సంఘం సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. నవంబరు 30లోగా అన్ని రకాల రుణాలను వందశాతం రికవరీ చేయాలన్నారు. కాగా, సమావేశానికి కొంతమంది గ్రామ సంఘం అసిస్టెంట్లు హాజరు కాకపోవడం, రుణాల వసూలులో నిర్లక్ష్యంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరును మార్చుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, డీపీవో సోమయ్య, స్త్రీనిధి ఆర్ఎం శ్రీలేఖ, ఏపీఎం కె.రమణాకర్, ఏపీవో సూరానాయక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

19న బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవం



పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్

నల్లగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నవంబరు 19న నిర్వహించే గిరిజన బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో స్వర్ణోత్సవ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే ఈ స్వర్ణోత్సవంలో గిరిజనులంతా పాల్గొనాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి మొదటి నుంచి కృషి చేసింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గిరిజన బంజారాల రిజర్వేషన్ 50 ఏళ్ల స్వర్ణోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పమాలార్పణ, సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో గిరిజన తెగలను ఎస్టీ జాబితాలో చేర్చినట్లు పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్‌కు 50ఏళ్లు పూర్తయినందున స్వర్ణోత్సవ వేడుకలను ఢిల్లీలో ఘనంగా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి గిరిజనులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో చందంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బద్యానాయక్, పలువురు గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

పంటల విస్తీర్ణంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం

గణాంకశాఖ డీడీజీ అజిత్‌కుమార్



అన్నెపర్తిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాకాలం పంటల విస్తీర్ణం, పంట రకాలు, నీటి వసతి, తదితర అంశాలను అధ్యయనం చేయనున్నట్టు జాతీయ గణాంక కార్యాలయం (నేషనల్ స్టాటిస్టిక్స్) రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్.అజిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అన్నెపర్తి గ్రామంలో సుమారు 20 సర్వే నంబర్లలో పంటపొలాలను ఆయన పరిశీలించారు. 20 సర్వే నంబర్లలో నాలుగు విభాగాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అందులో భాగంగా వివిధ రకాల పంటలు, నీటి వసతి, విత్తన రకం, తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా పంట సీజన్లలో జాతీయ గణాంక విభాగం నుంచి పంటల క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ కే.పరశురాం, ఎంపీఎస్‌వో శేఖర్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యత నగుబాటు

- రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు
- ఆరు నెలలకే కంకర తేలిన వైనం



కంకర తేలిన సీసీ రోడ్డు

కొండమల్లేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సీసీ రోడ్ల నిర్మాణం కాంట్రాక్టర్లకు వరంగా మారుతోంది. మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులోని శివజ్యోతినగర్‌లో ఈ ఏడాది మార్చి 10న ఎన్ఆర్‌జీఎస్ నిధులతో రూ.30లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఆరునెలలకే కంకర తేలింది. సీసీరోడ్డు నిర్మాణానికి ముందు మట్టి రహదారిని చదును చేసి కంకర పరచాలి. అంతేగాక రోడ్డు మొత్తం ఒకే మందంతో ఉండాలి. అయితే ఈ రోడ్డు చివరి అంచులు మాత్రం అంచనాలకు తగ్గట్టు ఏడు అంగుళాల వరకు కనిపిస్తున్నా మధ్యలో మాత్రం అందులో సగమే ఉంది. సిమెంట్ పరిమాణాన్ని తగ్గించడం, దాని స్థానంలో కంకర పొడి, నాణ్యత లేని ఇసుకను కలిపి సీసీ రోడ్డు నిర్మించడంతో నెలలోపే కంకర తేలి నెర్రలు,పగుళ్లు వచ్చి ధ్వంసమవుతున్నాయి.సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యాక ఇరువైపులా మట్టి పోసి లెవల్ చేయాలి. కానీ ఎక్కడా మట్టి పోయకుండానే బిల్లులు డ్రాచేస్తున్నట్టు తెలుస్తోంది. నాణ్యత, నిబంధనలు పాటించకపోవడంతో ఆరు నెలలు గడవకముందే రోడ్డు కంకర తేలి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డును ధ్వంసంచేసి డ్రైనేజీకి మరమ్మతులు

మట్టి రోడ్డును చదును చేయకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి దానిపై సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిపోవడంతోపాటు, సీసీ రోడ్డుపై ఓ లారీ వెళ్లడంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సైతం కుంగింది. దీంతో కొంత మంది వారి ఇంటి ముందు నుంచి వెళ్తున్న మురుగు నీటి కోసం రోడ్డును ధ్వంసం చేసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి మురుగు వెళ్లేలా చేశారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..



సీసీ రోడ్డు నిర్మించి ఐదారు నెలలు గడవకముందే కంకర తేలింది. రోడ్డు పనుల్లో ఎలాంటి నిబంధనలు పాటించక ఇష్టానుసారంగా నిర్మించడంతో కొద్ది రోజులకే మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. రోడ్డు నాణ్యంగా లేదని అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. సరిపడా సిమెంట్ వేయకుండా కంకర, ఇసుక అధికంగా కలపడంతో రోడ్డుపై కంకర తేలింది. ఇప్పటికైన అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

- కుంభం యాదగిరిగౌడ్, కొండమల్లేపల్లి

చింతపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం నేడు

చింతపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంలోని శివ సాయి జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శనివారం ప్రారంభిస్తారని మాల్ మార్కెట్ కమిటీ కార్యదర్శి వేణుకుమార్ శుక్రవారం తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం

దేవరకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తోందని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని పలు కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క గణేష్, అనిల్, శివలింగం, శ్రీకాంత్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా?

● అసంపూర్తి పనులతో తప్పని అవస్థలు ● మధ్యలో వదిలేయడంతో ఇబ్బందులు

మాడ్గులపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. ప్రభుత్వ హామీలు అమలుకావడంలేదు. మాడ్గులపల్లి మండలంలోని ఆగామోత్కూర్ గ్రామ శివారులో పాలేరువాగుపై వంతెన నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణానికి రూ.3.13కోట్లు కేటాయించారు. అప్పటినుంచి కొంత పనులు చేసిన కాంట్రాక్టర్ ప్రభుత్వం నిర్ణయించిన నిధులు సరిపోవడంలేదని, అదనంగా మరో రూ.75లక్షలు అవసరమవుతాయని అధికారులకు నివేదించాడు. ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి కేటాయించిన బడ్జెట్ ప్రకారం రూ.3.13కోట్ల పనులను కాంట్రాక్టర్ పూర్తిచేశాడు. వంతెనకు ఇరువైపులా పూర్తి చేసినా మధ్యలోనే అసంపూర్తిగా వదిలివేయడంతో నిర్మాణం పూర్తికాక గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిస్తే పాలేరువాగు నిండి అలుగు పోస్తున్నందున రాకపోకలు సాగించడానికి గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా గ్రామంలోని రైతులు, పశు పోషకులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. . వాగు అలుగుపోయడం, వంతెన నిర్మాణం పూర్తికానందున ప్రజలు అవస్థలు పడుతున్నారు. వంతెనను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ అదనపు నిధులు అడుగుతున్నాడని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆగామోత్కూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మీసేవా కేంద్రాలు ఉన్నందున నిత్యం పలు పనుల కోసం కల్వలపాలెం, బొమ్మకల్, చర్లగూడెం, బీమనపల్లి, పాములపాడు గ్రామల ప్రజలు ఈ రోడ్డు నుంచి రాకపోకలు చేయాల్సి ఉంది. వంతెనను పూర్తి చేయనందున్న ప్రజలు పోరెడ్డిగూడెం, చిరుమర్తి గ్రామాల మీదుగా వ్యయప్రయాసలతో ఆగమోత్కూరుకు చేరుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఆగామోత్కూర్‌లో అసంపూర్తిగా మిగిలిన బ్రిడ్జి నిర్మాణ పనులు

ఇబ్బందులు పడుతున్నాం



ఆగామోత్కూర్ గ్రామంలోని పాలేరు వాగుపై వంతెన నిర్మాణం పూర్తికానందున గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. బ్యాంక్, మీసేవా కేంద్రాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. వర్షాకాలంతో వాగు దాటాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

● చిట్యాల లవకుశ, కల్వలపాలెం

మిగిలిన పనులను పూర్తి చేయాలి



ఆగామోత్కూర్ పాలేరు వాగుపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలి. వాగును దాటి వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించాలి.

●భూపతి నరేష్, ఆగామోత్కూర్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

ఆగామోత్కూర్ గ్రామంలో నిర్మిస్తున్న వంతెనను పూర్తిచేయడానికి అదనపు పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్ రూ.3.13కోట్లను వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్ ఖర్చుచేశాడు. మిగిలిన పనులకు నిధులు కావాలని కాంట్రాక్టర్ కోరగా, ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు విడుదలైతే మిగిలిన పనుల పూర్తి చేస్తాం.

● మధు, పీఆర్ ఏఈ

ఎకరానికి రూ.30వేల ఆర్థికసాయం అందించాలి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



ఐలాపురంలో నేలవాలిన వరి పైరును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30వేలు అందించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఐలాపురం గ్రామ శివారులో అకాల వర్షాలతో నేలవాలిన వరి పైర్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 2లక్షల ఎకరాల్లో పత్తి, వరి, ఇతర పంటలు దెబ్బతిన్నాయని, ఎకరాకు రూ.30వేలు అందించి రైతులను ఆదుకోవాలని, లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ముడావత్ రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, కోట శ్రీనివాస్‌రెడ్డి, సాయన్న, హనుమానాయక్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి



జాతీయ సేవా పథకం వాలంటీర్ల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి

డిండి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యం నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని డిండి మండల కేంద్రంలోని దొంతినేని నర్సింహరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా శిబిరం ముగింపు సందర్భంగా వాలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజులుగా తిరుమలగిరి, ఎడ్లగడ్డ తండా, దొంతినేని నర్సింహరావు జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రమదానం చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్, కృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీరాములు, హనుమంతు, లింగస్వామి, జ్యోతిశ్రీ, కోకిల, ప్రేమనందం పాల్గొన్నారు.

యోగా శిక్షణ సమాజ సేవలాంటిది



పతంజలి యోగా సభ్యులతో రాష్ట్ర కమిటీ సభ్యులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే యోగా శిక్షణ సమాజ సేవలాంటిదేనని యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సత్యారెడ్డి అన్నారు. పట్టణంలోని యోగా సెంటర్లను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. సమస్త రోగాలను నయం చేసే అతీత శక్తి యోగాకు ఉందన్నారు. జబ్బులు, తీవ్రతను బట్టి యోగాసనాలు ఉంటాయని, నమ్మకంతో సాధన చేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. ఎటువంటి ఖర్చు, సైడ్ ఎఫెక్ట్స్ లేని చికిత్స యోగాతోనే సాధ్యమన్నారు. యోగాను, శిక్షకులను ప్రోత్రహించేందుకు రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నకిరేకల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కరుణం లుగేంద్రపిళ్లై, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోల సైదులు, ప్రధాన కార్యదర్శి ఆచార్య శివ, చీదళ్ల వెంకటేశ్వర్లు, పోలిశెట్టి లక్ష్మయ్య, జ్ఞానేశ్వరి, యాదయ్య, నర్సింహారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో తెస్తే మద్దతు ధర

(5వ పేజీ తరువాయి)

కలెక్టర్ ఇలా త్రిపాఠి, పౌర సరఫరాలశాఖ డీఎం గోపికృష్ణ, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, చండూరు ఏఎంసీ చైర్మన్ దోటి నారాయణ, తహసీల్దార్ నరేష్ నేలపట్ల, ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, సీసీఐ బయ్యర్ బాలాజీ నింజే, ఏఎంసీ సెక్రటరీ కె.రవి, గిర్దావర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో దివ్యాంగులకు ధ్రువపత్రాల జారీ కేంద్రం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం ఈ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కాగా, ఈ కేంద్రాన్ని రూ.15లక్షలతో ఆధునీకరిస్తున్నారు. వాల్ పెయింటింగ్స్, వైద్యులు, రోగులు విడివిడిగా వేచి ఉండేందుకు విభాగాలు, మరుగుదొడ్లు, కుర్చీలు, ఫ్యాన్లు తదితర సౌకర్యాల కల్పన పూర్తయింది. ఆధునీకరన పనులు చివరి దశకు చేరుకోగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, ఆర్ఎంవో డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్లు రత్న, స్వప్న, రజని, వినయ్, తదితరులు ఉన్నారు.

ఎండిన చెట్టు.. కింద పడేట్టు..



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో ఎన్నెస్పీ గెస్ట్ హౌస్ ప్రధాన గేటుకు ఎదురుగా ఎండిన చెట్టు

మిర్యాల గూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో పచ్చని చెట్లు ప్రజలకు ఆహ్లాదం కలిగిస్తుండగా, ఎన్నెస్పీ గెస్ట్ హౌస్ ప్రధాన గేటుకు ఎదురుగా ఎండిన వేప చెట్టు భయాందోళన కలిగిస్తోంది. ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఆనుకుని వాటర్ ట్యాంక్ ప్రాంతంలో ఎమ్మెల్యే క్యాంప కార్యాలయానికి వెళ్లే రహదారిలో పూర్తిగా ఎండిన వేప చెట్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. రోడ్డు మీదకు ఒరిగి ఉన్న ఈ చెట్టు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనతో ఉన్నారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ చెట్టును మునిసి పాలిటీ అధికారులు తొలగింపజేసి, దాని స్థానంలో రెండు మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, గుర్రంపోడు అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని గిట్టుబాటు ధరను పొందాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, గుర్రంపోడు మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,380, కామన్ రకం ధాన్యానికి రూ.2360లు మద్దతు ధర లభిస్తుందని, సన్నధాన్యానికి రూ.500లు బోనస్ కూడా అందిస్తున్నామని అన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమతో ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే భూమికి సంబంధించిన పత్రాలను నిర్వాహకులకు రైతులు అందజేస్తే ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ రిక్కల మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో సత్యం, పాక్స్ జిల్లా అధికారి, పత్యానాయక్, నాయకులు కుందూరు రాజేందర్‌రెడ్డి, మాలే సత్యనారాయణరెడ్డి, మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి, తహసీల్దార్ రఘు, డైరెక్టర్లు వెంకటయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. గుర్రంపోడులో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి మాధవరెడ్డి, ఎంపీడీవో విజయభాస్కర్, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, కంచర్ల వెంకటేశ్వరరావు, తగుళ్ల సర్వయ్య, కంచర్ల విజేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కాటేపల్లి రాధ కృష్ణ, సయ్యద్‌మియా, జాల చిన్న సత్తయ్య, బొమ్ము శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, ఆవుల వెంకన్న, కంసాని లక్ష్మారెడ్డి, నగేష్‌గౌడ్, మేడి వెంకన్న, భాస్కర్‌రెడ్డి, కిరణ్, జగదీశ్వర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఈఎల్‌వీ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్

కొండమల్లేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన అందుగుల సైదమ్మ, వెంకటయ్య దంపతుల కుమార్తెలు తేజశ్రీ, ప్రవళిక ఇరువురు నీట్ పరీక్షలో ర్యాంకులు సాధించారు. కాగా ఎంబీబీఎస్ విద్యను చదవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతునుఉ్నరు. ఆ విషయం తెలుసుకున్న ఈఎల్వీ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ఇద్దరు యువతులకు శుక్రవారం రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్‌కు వెంకటయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎల్వీ ఫౌండేషన్ సభ్యులు కిరణ్, మహేష్‌గౌడ్, నరేష్, సైదులు, లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ప్రజాప్రభుత్వం



గుడిపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం గుడిపల్లి మండల కేంద్రంలో జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ విత్ పీపుల్స్ కార్యక్రమంలో భాగంగా వివిధ కాలనీల్లో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అధికారులతో మాట్లాడి అక్కడిక్కడే పరిష్కరించారు. మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారుల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు డబ్బులు డిమాండ్ చేస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ పాలనలో రూ.8లక్షల కోట్ల అప్పు చేశారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కోదండపురం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అర్జున్‌రాంప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

కొండమల్లేపల్లి: పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండలంలోని చిన్న అడిశర్లపల్లి గ్రామ సమీపంలోని శివ గణేష్ కాటన్ మిల్లు వద్ద సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లారు. కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతి మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సర్వయ్య, వంగాల ప్రతాప్‌రెడ్డి, దూదిపాల శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్, కాసర్ల వెంకటేశ్వర్లు, గంధం సురేష్, బండారు అశోక్, రవీందర్‌రెడ్డి, కిరణ్, బయ్యర్ల రమేష్, అవినాష్, ముక్కమల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక మాస పూజలు



వీటీ నగర్ సంతోషిమాత ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ సంతోషిమాత, రాజరాజేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో లలిత సహస్రనామ పారాయణంతో పాటు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. దీంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పత్తి రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



కల్లేపల్లి గ్రామంలో పత్తి పైరును పరిశీలిస్తున్న ఏవో రుషేంద్రమణి

దామరచర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు పంట సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో రుషేంద్రమణి అన్నారు. మండలంలోని కల్లేపల్లి గ్రామంలో పత్తి పైర్లను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. పత్తి పైర్లను పచ్చదోమ, తెల్ల దోమ, ఆకుమచ్చ తెగులు, కాయ తొలుచు పురుగు ఆశించాయన్నారు. రసం పీల్చే పురుగులకు ఎసెటమీప్రైడ్ 2గ్రాములు లీటర్ నీటిలో, ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బన్డిజం, మ్యాన్కోజబ్, లద్దపురుగుల నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్, వేప నూనె పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఆర్.పార్వతి, ఎ.సైదులు, రైతులు లావుడియా ఎర్రనాయక్, ధీరావత్ నిమ్మ, ఎల్.బాబు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సందిగ్ధం

(5వ పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు.

బాయిల్డ్ రైస్ తరలిస్తేనే..

ఉమ్మడి జిల్లాలో మిల్లులకు యాసంగి సీజన్‌లో సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యానికి సంబంధించి ఇంకా 40శాతం మేర బియ్యం మిల్లుల్లోనే నిల్వ ఉంది. ఈ బియ్యాన్ని పూర్తిగా సేకరిస్తే నిల్వ చేసేందుకు గోదాములు లేకపోవడంతో, ప్రభుత్వం సైతం ఈ బియ్యం అప్పగించాలని ఆదేశించలేని పరిస్థితి నెలకొంది. గోదాముల్లో నిల్వ ఉన్న బాయిల్డ్ రైస్‌ను ఎఫ్‌సీఐ తరలించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఎఫ్‌సీఐ నుంచి ర్యాక్‌మూమెంట్ లేకపోవడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యం ఉండగా, వాటిల్లో వంద శాతం మేర నిల్వలు పేరుకుపోయాయని తెలిసింది. అందులో ఎఫ్‌సీఐ తీసుకోవాల్సిన 2,46,267 మెట్రిక్‌టన్నుల బియ్యానికి అనుమతులు తీసుకోవడంతో పాటు, రవాణాకు సంబంధించిన రైల్వే ర్యాకులు వచ్చేలా చర్యలు తీసుకోకపోతే ఈ సీజన్‌లో ఆయకట్టు నుంచి ధాన్యం వచ్చే సమయానికి కొనుగోళ్లలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ప్రస్తుతానికి మార్కెటింగ్‌శాఖ పరిధిలోని గోదాములనైనా వానాకాలం ధాన్యం నిల్వకు కేటాయించేందుకు అధికారయంత్రాంగం కసరత్తు చేస్తోంది. మార్కెటింగ్‌శాఖ పరిధిలోని గోదాములతో పాటు, అవసరమైతే ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకొని నిల్వచేసేందుకు చర్యలు తీసుకోవాలనే సూచనలు ఇటు మిల్లర్ల నుంచి అటు రైతుల నుంచి వస్తున్నాయి.

జిల్లా	ధాన్యంఉత్పత్తి	కొనుగోలు లక్ష్యం
	(లక్షల మెట్రిక్ టన్నుల్లో)	
నల్లగొండ	12.00	6.00
సూర్యాపేట	11.98	4.37
యాదాద్రి	6.00	4.00
మొత్తం	29.98	14.37

14.37 లక్షల మెట్రిక్‌టన్నుల కొనుగోలు లక్ష్యం

వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 29.98లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా, అందులో 14.37లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 1,000కి పైచిలుకు కొనుగోలుకేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్‌లో సన్నధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో ఈ రకాలు అధికంగా మిల్‌పాయింట్ల వద్దే విక్రయమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● ఎర్ర ఆంజనేయులు

దేవరకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు అన్నారు. శుక్రవారం దేవరకొండ అంబేడ్కర్ గ్రంథాలయంలో జరిగిన నియోజకవర్గ యువజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 26న భారత రాజ్యాంగం ఆమోదించబడిన రోజు , గ్రామ, గ్రామాన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలన్నారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని అన్నారు. ఈ సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు నాగిళ్ల వెంకటయ్య, వంగూరి శ్రీను, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లకు కేంద్ర బిందువుగా జిల్లా

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటేషన్లకు కేంద్రబిందువుగా జిల్లా మారిందని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ అన్నారు. మిర్యాలగూడలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా గిరిజన సంక్షేమ శాఖలో డిప్యూటేషన్లు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం బదిలీలపై ఆంక్షలు విధించగా, స్వలాభం కోసం డిప్యూటేషన్లు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. సంక్షేమ, విద్యాశాఖలో డిప్యూటేషన్లు మరే ఇతర జిల్లాల్లో లేవన్నారు. ఉన్నతాధికారులు రెగ్యులర్ పోస్టుకు పంపి, వెనువెంటనే డిప్యూటేషన్ అంటూ పూర్వ ప్రాంతానికి తెచ్చుకుంటున్నారన్నారు.ఈ వ్యవహారంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో పుట్ట సంపత్, వెంకటేశ్వర్లు, బన్నీ తదితరులు పాల్గొన్నారు.